క్లుప్తంగా

సాగర తీరాల పరిశుభ్రతలో విద్యార్థినులు



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు

మల్కాపురం: పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఆర్కే బీచ్, యారాడ బీచ్ తీరాల వద్ద ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పి.శివరంజని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 150 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: బీజేపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ్ జీ.సి.నాయుడు ముఖర్జీ చిత్రటటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిహెచ్.మంజుల, నాదెళ్ల జ్యోతి, ఎస్.కృష్ణారావు, సురేష్, గొటివాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ఈపీఎఫ్ సబ్‌స్టేషన్, మర్రిపాలెం వుడా లేఅవుట్ సబ్‌స్టేషన్, గ్రీన్ గార్డెన్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల, పోలీస్ క్వార్టర్లు, ఈపీఎఫ్ క్వార్టర్లు, లీడర్ ప్రెస్ ఏరియా, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, శ్రీనివాసనగర్, హౌస్సేస్ నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, పార్వతీ నగర్, పంజాబ్ హోటల్ జంక్షన్, రైల్వే క్వార్టర్లు, శాంతినగర్, జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దాబాగార్డెన్స్: వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా ప్రధాన గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జోన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అండర్ బ్రిడ్జిల ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సహాయంతో తొలగించాలని ఆదేశించారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

మర్రిపాలెం: మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ దరి బర్మాక్యాంప్ వద్ద ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేయగా పెంటాజోసిన్, లేక్టేట్ (1ఎంఎల్) 850 ఇంజెక్షన్లు లభ్యమయ్యాయి. షాపు యజమాని గెడ్డం కళ్యాణ్, ప్రసాద్, పెదపూడి రాంప్రసాద్ కలిసి ఈ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు



బాజి జంక్షన్ కల్యాణ మండపంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



గోపాలపట్నం మండపంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు, జెడ్సీ మల్లయ్యనాయుడు

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 91, 92 వార్డుల లబ్ధిదారులకు 1,904 ధ్రువపత్రాల అందజేత

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలను సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలు పొందాలని ఆయన కోరారు. జీవీఎంసీ 91, 92 వార్డుల పరిధిలోని బాజి జంక్షన్ రాజీవ్ మినీ కల్యాణ మండపం, గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ రెండు వార్డుల్లోని 471, 472, 481, 480, 483 సచివాలయాల పరిధిలో 1,904 ధ్రువపత్రాలు అందించారు. సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి ఆడారి ఆనంద్‌కుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫీడ్‌బ్యాక్ వల్ల చాలా మంది అర్హత ఉన్నా.. సాంకేతిక కారణాలతో ధ్రువపత్రాలు లేక సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా.. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారి ఇబ్బందులు, అవసరాలు కనుక్కొని ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు తీసుకున్నారన్నారు. సచివాలయ కార్యదర్శుల ద్వారా తక్కువ సమయంలోనే లబ్ధిదారులందరికీ అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు.

సేవలు పొందండి..

జీవీఎంసీ జోన్-8 కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. స్థానికులు తమ సమస్యలపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా క్యాస్ట్, ఇన్‌కం, డెత్, బర్త్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమం నిర్వహించిన చోట ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో, ఏపీడీ శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ జయరామ్, వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గేదెల మురళీకృష్ణ, అయితంశెట్టి గోపాలకృష్ణ, నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే కుల ధ్రువపత్రం



వలంటీర్ మా ఇంటికి వచ్చి సమస్యలు ఏమైనా ఉన్నాయా.. ధ్రువపత్రాల అవసరముందా అని అడిగి తెలుసుకుని దరఖాస్తు చేయించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల ధ్రువపత్రం అందుకున్నారు. ఎక్కడికీ తిరగకుండానే కేవలం రెండు రోజుల్లోనే సర్టిఫికెట్ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– పుర్రె సన్యాసమ్మ, లక్ష్మీనగర్

ఎక్కడికీ వెళ్లకుండానే సర్టిఫికెట్ వచ్చింది



కుల ధ్రువీకరణ పత్రం కోసం అనేక ఇబ్బందులు పడ్డాను. జగనన్న సురక్ష కార్యక్రమం దయవల్ల వెంటనే వచ్చేసింది. ఎక్కడికి వెళ్లకుండా సర్టిఫికెట్ అందుకున్నారు. జగన్‌బాబుకు ధన్యవాదాలు.

– సిహెచ్.సత్యవతి, గోపాలపట్నం

జగనన్న సురక్ష మంచి కార్యక్రమం



జగనన్న సురక్ష చాలా మంచి కార్యక్రమం. చాలా మందికి ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. వలంటీర్లు ఇంటికి వచ్చి ఈ సర్టిఫికెట్ల గురించి వివరించారు. మా చేత దరఖాస్తు చేసించారు. ఒక రోజులోనే కుల ధ్రువపత్రం అందించారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– కలమటి మోహనరావు, గోపాలపట్నం

మృతుని కుటుంబ సభ్యులకు ఆడారి పరామర్శ



కృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు లేబర్ జంక్షన్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే గ్యాస్ డెలివరీ బాయ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ఉదయం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా.. మృతుడు కృష్ణ 58వ వార్డు గొడేశివానిపాలెంలో కొనుగోలు చేసిన భూమిలో ఇల్లు కట్టనివ్వకుండా.. ఆ పక్కింట్లో ఉన్న వారు అడ్డుకుంటున్న తీరు వల్ల అతడు ఆందోళనకు గురై మృతి చెందాడని టీడీపీ స్థానిక నాయకుడు పూడి భాస్కర్‌రావు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్‌ల ద్వారా తెలుసుకున్న ఆడారి ఆనంద్‌కుమార్ ఈ విషయంలో అధైర్య పడొద్దన్నారు. ఆ స్థలం కృష్ణదే అయితే.. అక్కడ ఇల్లు నిర్మించుకోడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తామని మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన హామీ ఇచ్చారు. నాయకులు కొల్లి నూకరెడ్డి, రేవళ్ల సత్యనారాయణ, భూపతి తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్



కస్తూరినగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కటుమూరి సతీష్

కంచరపాలెం: దళితుల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన కృషి ఎనలేనిదని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46వ వార్డు కస్తూరినగర్‌లో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం బాబూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అక్కడి జగ్జీవన్ రామ్ విగ్రహానికి సతీష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. బాబూజీ సేవలను కొనియాడి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాపతి అప్పారావు, బి.గోవిందు, చిన్నారావు, కె.లావణ్య, జి.అప్పారావు, కె.రామారావు, ఎన్.కృష్ణ, బాల, కె.ఈశ్వరరావు, డేనియల్, శంకరరావు, వసంత, విజయలక్ష్మి, దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

23న గవర విద్యార్థులకు అభినందన సభ



కరపత్రికలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ చూపిన గవర సామాజిక వర్గ విద్యార్థులకు ఈ నెల 23న తాటిచెట్లపాలెం ఆశీర్వాద్ కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు గౌరీ(గవర) సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఈ వివరాలు వెల్లడించి, కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. గవర విద్యార్థినీ, విద్యార్థులను విద్యలో ప్రోత్సహించే నిమిత్తం ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వివిధ రంగాల ప్రముఖులచే, తల్లిదండ్రుల సమక్షంలో నగదు బహుమతి, మెమొంటో, మెరిట్ సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరిస్తామన్నారు. గవర విద్యార్థులు ఈ నెల 15లోగా రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చఅప్పారావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పెంటకోట సంజీవరావు నాయుడు, మల్ల శంకరరావు, పీల ప్రసాద్, శరగడం సత్యనారాయణ, వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కబళించిన లారీ



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది.

ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన డొపా సీతారామ్(అలియాస్ రాము) (50) ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లిన అతడు ఈ రోజు ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యాన మందిరంలో సేవా కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ధ్యాన మందిరం ఆవరణలో పినాకిల్ హాస్పిటల్ సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు, వీ డెంటల్ సిబ్బంది దంత వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాలను ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్ ఉదారత

- రెండు పేద కుటుంబాలకు సొంతనిధులతో పింఛన్ అందజేత



ఆడారి ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పింఛన్ అందజేస్తున్న హరీష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్ ఉదారత చాటారు. ఇందిరా కాలనీ స్లమ్‌లో నివసిస్తున్న సత్తిబాబు అనే దివ్యాంగుడు, 11 నెలల ప్రణతి(గొంతు సమస్యతో బాధపడుతోంది) కుటుంబాలు పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయి. వీరిరువురు ప్రభుత్వ పింఛన్ పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. సాంకేతిక సమస్య కారణంగా వీరికి పెన్షన్ మంజూరు కాలేదు. ఇరు కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్ ఒక్కొక్కరికీ నెలకు రూ.2 వేల చొప్పున ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు అందిస్తానని ముందుకొచ్చారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా ఆయన క్యాంప్ కార్యాలయంలో సత్తిబాబు, ప్రణతిలకు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ కార్యకలాపాలతోపాటు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురికి ఆదర్శంగా నాయకులంతా నిలవాలని ఆడారి ఆకాంక్షించారు. ఈ రెండు పేద కుటుంబాలకు ప్రభుత్వ పింఛన్ మంజూరయ్యేలా అధికారులతో మాట్లాడుతానని భరోసా ఇచ్చారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి



కుక్కలకు వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రమణ



పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను వేస్తున్న డాక్టర్ సునీల్

గోపాలపట్నం: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ముందుగా కార్యక్రమాన్ని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటిపై ప్రేమను చూపించినా, వాటి నుంచి మనకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడీ రవికుమార్ మాట్లాడుతూ ర్యాబిస్ వ్యాధి అతి ప్రమాదకరమైనదని తెలిపారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పెంపుడు జంతువుల వల్ల సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించేందుకు జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. మూడు కౌంటర్లలో వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి వద్ద..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామం ప్రభుత్వ పశువుల ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు గురువారం యాంటీ ర్యాబిస్ టీకాలను ఉచితంగా వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పశువులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయన్నారు. అయితే భవనం శిథిలావస్థకు చేరకున్నందున సంరక్షించాల్సిన అవసరం ఉందని, దీనిపై షిప్‌యార్డ్‌కు విన్నవించామన్నారు. సమస్యను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామని, తర్వలోనే ఆస్పత్రి మరమ్మతులను చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో సుమారు 575 కుక్కలకు టీకాలను వేసినట్లు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం లక్ష్యం



56వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 56వ వార్డు కంచరపాలెం రాజీవ్ కాలనీ, ముత్యమాంబ కాలనీ సచివాలయం 316 ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మురికివాడల్లో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయని, రైలు పట్టాల మార్గాల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆయనకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అధికారుల దృష్టికి ప్రతి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తూ సంపూర్ణ మనసుతో ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. శుక్రవారం 56వ వార్డులో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, యూత్ అధ్యక్షుడు మజ్జి నూకరాజు, దాసరి శామ్యూల్, కె.వి.నరసింహారావు, నమ్మి శ్రీను, మహిళా నాయకురాలు సాయిలత, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నత్తనడకన భూగర్భ పైప్‌లైన్ల పనులు

- పారిశ్రామిక ప్రాంతంలో తవ్వి వదిలేసిన రోడ్లు
- గోతులతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు



మల్కాపురం కృష్ణ బార్ వద్ద సర్వీస్ రోడ్డులో నెలల తరబడి తవ్వుతున్న గోతులు



ఆర్‌కే పురంలో సరిగ్గా పూడ్చని గోతులు



వర్షానికి బురదమయమైన రహదారి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భ పైప్‌లైన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు నెలల కిందట పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన సర్వీస్ రోడ్డు మధ్యలో గోతులు తవ్వారు. నెలలు గడుస్తున్నా.. నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నా.. అధికారులు స్పందించకపోవడం దారుణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి గోతులను వెంటనే పూడ్చేలా చర్యలు చేపట్టాలని స్వయంగా జీవీఎంసీ కమిషనర్ ఆదేశించినా.. నేటికీ అది ఆచరణకు నోచుకోలేదు.

జీవీఎంసీ కమిషనర్ ఆదేశించినా..!

ఇండియన్ కోస్ట్ గార్డు పరిపాలన భవనం, క్వార్టర్స్‌లో తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.9 కోట్లతో 9 కిలో మీటర్ల మేర రెండు నెలల కిందట కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయం నుంచి జింక్ వరకు వెళ్లే ప్రధాన సర్వీస్ రోడ్డు మధ్యలో భూగర్భంలో పైపులు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. ఈ నిమిత్తం తవ్విన గోతులను పని పూర్తయ్యాక వాటిని మట్టితో కప్పి ఆపై బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. కానీ వీరు కొన్ని చోట్ల పనులు పూర్తి చేసుకున్న ప్రదేశంలో గోతులను సరిగ్గా కప్పలేదు. మట్టిని ఆ గోతులపై గుట్టలుగా వేసి విడిచిపెట్టారు. అది రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కరిగి రోడ్డుపైకి వచ్చి బురదలా మారింది. దీంతో ఆ మార్గాన వచ్చే వాహనాలు జారి అదుపు తప్పుతున్నాయి. రెండు వారాల కిందట 60వ వార్డు పర్యటనకు వచ్చిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సరిగ్గా పూడ్చని గోతులను చూశారు. వాటిని సక్రమంగా కప్పేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేటికీ అది జరగలేదు. సంబంధిత అధికారులు దృష్టిసారించి పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రేషన్ పంపిణీలో పొరపాట్లు జరిగితే చర్యలు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

కంచరపాలెం: చౌక ధరల దుకాణాల్లో, ఇంటింటికీ రేషన్ డెలవరీ వాహనాల ద్వారా సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. కంచరపాలెం పరిధిలోని రేషన్ డిపోలు, రేషన్ వాహనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సివిల్ సప్లై, ఐసీడీఎస్ అధికారులతో కలిసి ఫుడ్ కమిషన్ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 54, 55వ వార్డుల్లోని రేషన్ దుకాణాల్లో బియ్యం స్టాక్ ఎంత వచ్చింది, ఎంత పంపిణీ చేశారు, ఎందరు కార్డ్ హోల్డర్స్ ఉన్నారు, రైస్ కార్డులు ఎన్ని ఉన్నాయి తదితర విషయాలను కాంతారావు అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ధర్మానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజన పథకంతోపాటు పిల్లలకు గుడ్లు సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. గోపాలపట్నంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాష్‌రావు, ఏఎస్‌వో మురళీధర్, సీడీపీవో అర్బన్ శ్రీలత, ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.